గురుపూజోత్సవానికి వచ్చే తీరిక లేదా?

- విద్యాశాఖపై మీ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం
- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గురుపూజోత్సవానికి గైర్హాజరుకావడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన గురుపూజోత్సవానికి హాజరయ్యే తీరిక మీకు లేదా ?' అంటూ నిలదీశారు. 'విద్యాశాఖపై మీకున్న చిత్తశుద్ధికి, ఆ శాఖకు మీరు ఇస్తున్న ప్రాధాన్యతకు ఇదే నిదర్శనం' అని గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శలు సంధించారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని పేర్కొన్నారు. 'ఓవైపు టీచర్లు లేక స్కూళ్లను మూసేస్తున్నరు.. మరో వైపు పురుగుల అన్నం.. గొడ్డుకారం తినలేక పిల్లలు ఏడుస్తున్నరు. ఫుడ్ పాయిజన్లు, పాముకాట్లు, కుక్కకాట్లు, ఎలుకకాట్లతో విద్యార్థులు రోదిస్తున్నరు' అని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు గురుకులాల ఖ్యాతిని రోజురోజుకూ దిగజార్చుతున్నదని విమర్శించారు. పాఠాలు చెప్పే టీచర్లను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని, తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పిల్లల భవిష్యత్తు గురించి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఉన్న విద్యావ్యవస్థను సక్రమంగా నిర్వహించడం ప్రభుత్వానికి చేతగావడంలేదని, పైగా సమీకృత గురుకులాలు, విద్యా కమిషన్ అంటూ భ్రమలు కల్పిస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో పతనమవుతున్న విద్యావ్యవస్థ గురించి టీచర్లు, విద్యార్థులకు ఏం సమాధానం చెబుతారని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

42% రిజర్వేషన్లు ఉత్తమాటేనా?

- బీసీ రిజర్వేషన్ పెంచకుండానే స్థానిక ఎన్నికలు?
- పార్టీలవారీగా సీట్లిద్దామనే ప్రతిపాదన తెరపైకి
- కోర్టుకెళ్లి అనుమతి తీసుకునే యోచనలో సర్కారు
- బీసీల పోరాటంపై పట్టింపేలేదు: ప్రజా సంఘాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీ ఉత్తమాటేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. బీసీ రిజర్వేషన్ పెంపు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదనే సంకేతాలే కనిపిస్తున్నాయి. గత ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. జూలైలో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాల పరిమితి ముగిసింది. సకాలంలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. ఈ కారణంగా కేంద్రం ఆర్థిక సంఘం నిధులను నిలుపుదల చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు బీసీ కులగణన, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై హామీలు గుప్పించారు. అసలు రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టకపోవడంతో స్థానిక ఎన్నికల్లో అసలు రిజర్వేషన్లను పెంచుతారా, లేదా? అన్న అనుమానం బీసీ వర్గాలను వెన్నాడుతున్నది. ప్రభుత్వం తగిన కార్యాచరణ చేపట్టకపోవడంతో అనుమానం కలిగిన బీసీ సంఘాల నేతలు వివిధ రూపాల్లో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. 42% రిజర్వేషన్ల సాధనే ప్రధాన డిమాండ్‌గా ఆమరణదీక్షలూ కొనసాగుతున్నాయి. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ ఏమైందని ప్రజా ప్రతినిధులను, మంత్రులను బీసీ సంఘాలు ఎక్కడికక్కడ ప్రశ్నిస్తున్నాయి. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42% కోటాను ప్రభుత్వపరంగా అమలు చేయకపోతే పార్టీపరంగా 42% స్థానాలు బీసీలకు ఇస్తామని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి తాజాగా సెలవిచ్చారు. దీనిపై బీసీ సంఘాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త కమిషన్‌తో మరింత జాప్యం

బీసీ నేత డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సారథ్యంలో బీసీ కమిషన్‌ను గత ప్రభుత్వం నియమించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ణయించడానికి, సుప్రీంకోర్టు ఈ కమిషన్‌కే బాధ్యతలను అప్పగించింది. రేవంత్ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా పలు సిఫారసులను, అధ్యయన పత్రాలను ఈ కమిషన్ అందజేసింది. వకుళాభరణం కమిషన్ సిఫారసులతోనే, రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే చేపట్టడానికి చర్యలు చేపట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలపై రెండుసార్లు ముఖ్యమంత్రి సమావేశాలు నిర్వహించినా రిజర్వేషన్ పెంపుపై స్పష్టమైన విధాన నిర్ణయాన్ని తెలుపలేదు. ఇంతలో ఆగస్టు 31న కమిషన్ మూడేండ్ల పదవీకాలం ముగిసింది. కాంగ్రెస్ సీనియర్లు, మంత్రులు కూడా కమిషన్‌ను కొనసాగించాలని కోరినట్టు విశ్వసనీయ సమాచారం. కానీ కాంగ్రెస్ కొత్త పాలకమండలి నియామకం వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చే అవకాశం ఉన్నది.

సీఎం రేవంత్‌రెడ్డి వైఖరితో గందరగోళం

సాధారణంగా ఒక నిర్దిష్టమైన అంశంపై కమిషన్‌ను నియమించినప్పుడు ఆ పని పూర్తయ్యేంత వరకు గడువు పెంచుతూ నివేదికలు స్వీకరించే ఆనవాయితీ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సంప్రదాయం. తాజాగా కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చైర్మన్‌గా జయప్రకాశ్ హెగ్డేతో బీసీ కమిషన్ పాలకమండలి ఏర్పడింది. సిద్ధరామయ్య సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ హెగ్డే కమిషన్ గడువును పెంచి కులగణనకు సంబంధించిన పూర్తి నివేదికను ఇటీవలే స్వీకరించింది. ఇదే కోవలో రేవంత్ ప్రభుత్వం కూడా వకుళాభరణం కమిషన్‌ను కొనసాగించి ఉండాల్సిందని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. బీసీ కమిషన్‌కు కొత్త పాలకమండలి నియామకం ఎప్పుడు అవుతుందో, ఈ పాలకమండలి అనుభవం గడించడానికి ఎన్ని నెలలు పడుతుందో, నివేదిక ఎప్పుడు ఇస్తుందో, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో.. మొత్తానికి అంతా గందరగోళ వాతావరణం నెలకొందన్నదన్న అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల జాబితాకు వానల ఎఫెక్ట్

13న ముసాయిదా, 28న తుది ఓటరు జాబితా

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనపై భారీ వర్షాల ప్రభావం పడింది. గతంలో ప్రకటించిన ఓటరు జాబితా షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ సవరించింది. అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో జిల్లా యంత్రాంగం, క్షేత్ర స్థాయి సిబ్బంది.. సహాయక చర్యలు, పునరావాసం, పునరుద్ధరణ తదితర పనుల్లో పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. దీంతో ఓటర్ల జాబితా గడువును మార్చినట్టుగా ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. వార్డులు, పంచాయతీల ముసాయిదా ఓటరు జాబితాను ఈనెల 13న ప్రదర్శిస్తామని, తుది ఓటరు జాబితాను ఈ నెల 28న ప్రకటిస్తామని తెలిపారు. ఆయా వివరాలు కిందివిధంగా ఉన్నాయి.

ఓటరు జాబితా దశలు తేదీలు (సెప్టెంబర్)

పంచాయతీల ముసాయిదా ఓటరు జాబితా	13
జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ	18
మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ	19
ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ	14 నుంచి 21 వరకు
అభ్యంతరాల పరిష్కారం	26
తుది ఓటరు జాబితా ప్రకటన	28

గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష విరమించిన సిద్దేశ్వర్‌కు నిమ్మరసం తాగిస్తున్న బీసీ అఖిలపక్ష నాయకులు

బీసీ నేత సిద్ధేశ్వర్ ఆమరణ దీక్ష విరమణ

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 5: కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని 12 రోజుల పాటు హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్ చేసిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం విరమించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీస్పీకర్ మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం, కల్లుగీత కార్మికుల సమాఖ్య మాజీ చైర్మన్ రవికుమార్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ పూర్ణచందర్‌రావు, సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కేవీగౌడ్, అంబేద్కర్ ఆజాదీ అధ్యక్షుడు నరహరి తదితరులు సిద్ధేశ్వర్‌కు నిమ్మరసం అందజేసి దీక్ష విరమింపజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముగ్గురు బీసీ నాయకులు 12 రోజులుగా ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. బీసీ డిక్లరేషన్ అమలు కోసం ఐక్య న్యాయపోరాటానికి సిద్ధమయ్యామని తెలిపారు.

పకడ్బందీగా ఓటరు జాబితా ప్రక్షాళన

- జనవరి 6న తుది ఓటరు జాబితా
- సీఈవో సుదర్శన్‌రెడ్డి

బీఆర్‌కేఆర్ భవన్‌లో ఓటరు జాబితా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఈవో సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితాను పకడ్బందీగా ప్రక్షాళన చేస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో)సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటరు ముసాయిదా జాబితాను అక్టోబరు 29న, తుది జాబితాను జనవరి 6న ప్రచురిస్తామని వెల్లడించారు. గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ఓటరు జాబితా ప్రక్షాళనపై రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 2025 జనవరి 1నాటికి 18 ఏండ్లు నిండిన వారు తమ ఓటు హక్కుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓటర్లు బీఎల్‌వోలకు సరియైన సమాచారం ఇవ్వాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు పేరు, చిరునామా, ఫొటోపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే వారికి చెప్పాలని సూచించారు. ప్రజలకు చేరువగా ఉండేందుకు బీఎల్‌వోల ఫోన్ నంబర్లు సైతం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3.33కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, 35,356 పోలింగ్ బూతులు ఉన్నాయని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఒక పోలింగ్ బూత్‌లో 1500 మంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే, మరో కొత్తపోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. ఇప్పటికే 70 లక్షల ఓటర్ల జాబితా పేర్లను పరిశీలించినట్టు చెప్పారు. కలెక్టర్లు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో జాబితా ప్రక్షాళనను పరిశీలిస్తారని స్పష్టంచేశారు. రాష్ట్రస్థాయిలో ఏడుగురిని అధికారులను ప్రత్యేక పరిశీలకులుగా నియమించనున్నట్టు చెప్పారు.

ఎన్‌వోపీఆర్‌యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 'మాచన'

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): నేషనల్ ఓల్డ్ పెన్షన్ రీస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాచన రఘునందన్ నియామకం కానున్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ కోసం ఎన్‌వోపీఆర్‌యూఎఫ్ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. 16న న్యూఢిల్లీలో నిర్వహించే సమావేశంలో ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు బీపీ రావత్ అధికారికంగా ప్రకటించనున్నట్టు రఘునందన్ తెలిపారు.

రాష్ట్రంలో 35 శాతం చెరువులు ఖాళీ

- నిండినవి 65 శాతమే
- 50 % నిండినవి ఆరువేలు
- 2,200 చెరువుల్లో 25 శాతం నీళ్లే

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రం ఓ వైపు అతలాకుతలం అవుతుండగా, మరోవైపు అనేక చెరువులు నీళ్లులేక వెలవెలబోతున్నాయి. రాష్ట్రంలో 35 శాతం చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలో 34,716 నీటిపారుదల చెరువులున్నాయి. వాటిలో నిండినవి దాదాపు 65 శాతమే. ఇందులో 6,000 చెరువులు కనీసం 50 శాతం కూడా నిండలేదు. వీటిలో 2,200 చెరువుల్లోకి 25 శాతం మించి నీళ్లు రాలేదు. హైదరాబాద్ నీటిపారుదల సర్కిల్‌లో (రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి) 2,599 చెరువులు ఉన్నాయి. వీటిలో 40 శాతం చెరువులు నిండనేలేదు. హైదరాబాద్‌లో శేరిలింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలిలో జోరుగా వర్షాలు కురిసినా ఎల్బీ నగర్, మేడ్చల్ ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన మేర లేవు. జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. వాతావరణ లెక్కల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక వర్షంపాతం నమోదైంది. కానీ జిల్లా వార్షిక వర్షపాతం కేవలం 374 మి.మీ మాత్రమే. జిల్లాలో కురిసింది మాత్రం 734 మి.మీ. మహబూబ్‌నగర్ జిల్లాల్లో 400 చెరువులున్నాయి. వీటిలోకి 50 శాతం కూడా నీళ్లు రాలేదని అధికారులు చెప్పున్నారు. నల్లగొండ జిల్లాలో 1,628 చెరువులు ఉన్నాయి. ఇందులో కనీసం వేయి చెరువుల్లో 50 శాతం నీళ్లు కూడా లేవు. 124 చెరువులు నిండాయి. 144 చెరువులు పొంగిపొర్లుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వరదలొచ్చాయి. ఈ జిల్లాలో 2140 ట్యాంకులున్నాయి. ఇందు లో నిండి పొర్లుతున్నవి 1800. 340 చెరువులు ఇంకా నిండాల్సి ఉంది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు తెలంగాణలో 597 మి.మీ వర్షపాతం రావాలి. ఇది సాధారణ వర్షపాతం. అయితే, రాష్ట్రంలో 836 మి.మీ వాన కురిసింది. అంటే 40% ఎక్కువగా వానలొచ్చాయి. ఈ కాలంలో 90 రోజులు వానలుకురవాలి. కానీ ఈ సారి కురిసింది 73 రోజులే.

సర్కారు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు

- గురుపూజోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి
- విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాలి: పొన్నం
- కార్యక్రమానికి సీఎం గైర్హాజరు

ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మంత్రి పొన్నం, మాజీ ఎంపీ కేకే

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని సర్కారు విద్యాసంస్థలకు ఈ నెల నుంచి ఉచిత విద్యుత్తును సరఫరా చేయనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క వెల్లడించారు. దీంతో రాష్ట్రంలోని 27,862 విద్యాసంస్థలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గురువారం రవీంద్రభారతిలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు సరఫరా కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 20 కాపీని ఆయన అధికారులకు అందజేశారు. ఇదే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా, రాష్ట్రంలో వరద పరిస్థితి నేపథ్యంలో హాజరుకాలేకపోయారని భట్టి తెలిపారు. ఇప్పటికే 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేశామని, మరో 6 వేలకు పైగా పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు తెలిపారు. స్కూళ్లల్లో శానిటైజేషన్ కోసం రూ.136 కోట్ల నిధులను విడుదల చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలోని సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. రాష్ట్రంలో త్వరలోనే ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ప్రారంభించనున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డులకు ఎంపికైన 150 మందిని ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, ఎమ్మెల్సీలు కోదండరాం, ఏవీఎన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, ఇంటర్‌విద్యా డైరెక్టర్ శృతి ఓజా,ఉపాధ్యాయ సంఘాల నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, లక్ష్మణ్, సదానంద్‌గౌడ్, పర్వత్‌రెడ్డి, జంగయ్య, చావ రవి, కటకం రమేశ్, మారెడ్డి అంజిరెడ్డి, హనుమంతరావు, నవాత్ సురేశ్, అబ్దుల్లా, సీ జగదీశ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వండి సారూ..

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గురువారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉచిత విద్యుత్తు కొన్ని విద్యాసంస్థలకేనా?

- 27 వేల విద్యాసంస్థలకే ఉచితమని ప్రకటన
- వివిధ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల మాటేమిటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విద్యాసంస్థలకు సర్కారు ఇస్తామన్న ఉచిత విద్యుత్తు కొన్నింటికేనా? అన్నింటికి కాదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు సదుపాయం కల్పిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం ప్రకటించారు. 27,862 విద్యాసంస్థలకు ఈ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలను కలుపుకుంటే 30 వేలకు పైగా ఉన్నాయి. వీటికి హాస్టళ్లు అదనం. దీన్నిబట్టి అన్నింటికీ ఈ సదుపాయం వర్తించనట్టే.

'సోలార్' అటకెక్కినట్టేనా?

ఉచిత విద్యుత్తు ప్రకటనతో విద్యాసంస్థల్లో సోలార్ ప్లాంట్ల అంశం అటకెక్కినట్టేనన్న వాదన తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికే 11 జిల్లాల్లోని 1,521 సర్కారు బడుల్లో సోలార్ ప్లాంట్లను నెలకొల్పారు. మరో 6,490 స్కూళ్లల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పా టు చేయాలని గతంలోనే విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలలతోపాటు, తెలంగాణ మాడల్ స్కూల్స్, కేజీబీవీలోను కొత్తగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటికోసం రూ.289 కోట్లు వెచ్చించనుండగా, టీజీ రెడ్‌కోకు సంస్థలను ఎంపిక చేసే బాధ్యతలను అప్పగించారు. ఇప్పుడు సర్కారు ఉచిత విద్యుత్తును ప్రకటించడంతో ఈ సోలార్ ప్లాంట్ల కథ కంచికి చేరినట్టేనని భావిస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు

సర్కారు స్కూళ్లు	26,826
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	428
ఎయిడెడ్ స్కూళ్లు	634
గురుకులాలు	1,237
కేజీబీవీలు	478
మాడల్ స్కూళ్లు	194
ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు	150
క్యాంపస్ కాలేజీలు	20
కాన్‌స్టియంట్ కాలేజీలు	8
పీజీ సెంటర్లు	11
పీజీకాలేజీలు	32

'ఆర్‌అండ్‌బీ' లో వేతనాలు బంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఆర్‌అండ్‌బీ శాఖలో కొంతకాలంగా క్లర్క్ ఉద్యోగాలతో పాటు డేటా ఎంట్రీ, సబార్డినేట్, డ్రైవర్ తదితర ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో అవసరాలకు అనుగుణంగా సుమారు 100 మందికిపైగా సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. అయితే, మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆఫీసుకు వచ్చేందుకు బస్‌పాస్‌లకు కూడా డబ్బులు లేని పరిస్థితి నెలకొందని ఉద్యోగులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు తమ గోడును పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. లీజు కార్లకు సంబంధించి ప్రతి నెలా ఒక్కో కారుకు రూ. 35వేల వరకు అద్దె చెల్లిస్తారు. ఇందులోనే డీజిల్ ఖర్చుతోపాటు డ్రైవర్ వేతనం కూడా ఉంటుంది. మూడు నెలలుగా లీజు తాలూకు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులుచేసి డీజిల్ కొంటున్నట్టు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

ప్రాజెక్టుల్లో ప్రమాదాలకు సీఈలదే బాధ్యత..

- వట్టెం ఘటనపై నివేదిక ఇవ్వండి : ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల్లో జరిగే తప్పులకు సంబంధిత చీఫ్ ఇంజినీర్లదే పూర్తి బాధ్యతని సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో వరద నష్టంపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలోని సీఈలతో జలసౌధ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద నష్టం, ప్రమాదాలను నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, హరిరాం, శంకర్, సీఈలు మంత్రికి వివరించారు. వట్టెం, భక్తరామదాసు పంప్‌హౌజ్‌ల మునక, మున్నేరు వరద, సాగర్ ఎడమకాలువకు గండికి గల కారణాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిధుల విడుదలలో తీవ్ర జాప్యమవుతున్నదని, ఫలితంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. వరద ఉధృతిలోనూ విధుల్లో నిమగ్నమైన నీటిపారుదలశాఖ సిబ్బందిని అభినందించారు. వరదలతో 223 చెరువులకు గండ్లు పడ్డాయని, 159 చోట్ల నష్టం వాటిల్లిందని, 112 కాలువలు తెగిపోయాయని, మొత్తంగా 544 చోట్ల డ్యామేజీలు ఏర్పడగా తక్షణ మరమ్మతులకు రూ.113 కోట్లు అవసరమవుతాయని, శాశ్వత మరమ్మతులకు 900 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని తెలిపారు. తెగిపోయిన చెరువు కట్టలు, కెనాల్స్ పునరుద్ధరణకు వారం రోజుల్లో టెండర్లు పిలిచి అనుమతులు మంజూరు చేయాలని అధికారులను సూచించారు. వట్టెం పంప్‌హౌజ్ మునకపై పూర్తివివరాలతో నివేదికను అందించాలని సీఈ విజయ్‌భాస్కర్‌ను ఆదేశించారు. కాలువలు, చెరువుల పర్యవేక్షణకు 1800 మంది లష్కర్లను నియమించాల్సి ఉంటుందని, ఆ మేరకు ప్రతిపాదనలను పంపించాలని సిబ్బందికి సూచించారు.

ఎడమకాల్వకు 2.10 కోట్లు

ఇటీవల గండిపడిన నాగార్జున సాగర్ ఎడమకాల్వకు తక్షణ మరమ్మతులను చేపట్టేందుకు ప్రభుత్వం రూ.2.10కోట్లతో పరిపాలన అనుమతులను బుధవారం మంజూరు చేసింది.

నిఘా నీడలో మంత్రులు!

మొదటిపేజీ తరువాయి...

రెండు నెలలుగా తెరపైకి వచ్చిన వివిధ అంశాల నేపథ్యంలో మంత్రులపై నిఘా మరింత పెరిగిందని చెప్పున్నారు. ఆ మంత్రులు హైదరాబాద్‌లోనో.. వారికి సంబంధించిన నియోజకవర్గంలోనో ఉన్నపుడే కాదు, వాళ్లు ఢిల్లీ వెళ్లినప్పుడు కూడా ఈ నిఘా కొనసాగుతున్నదని సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొన్ని రోజులు ఎలాంటి నిఘా లేకుండా చూశారు. కానీ, తర్వాత క్రమంగా నిఘా పెరుగుతూ వచ్చింది. మొదట్లో ఒకరిద్దరు మంత్రులపైనే కొన్ని అంశాలను కేంద్రీకరించి నిఘా వర్గాల ద్వారా సమాచారం సేకరించేవారు. ఆ తర్వాత దాన్ని విస్తృతపరిచారు. ఒకరి నుంచి ఇప్పుడు సుమారు ఆరుగురు మంత్రులపై నిఘా గట్టిగానే పెట్టినట్టు తెల్సింది. మంత్రులే కాదు.. పాత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన మాజీ మంత్రులు, బీఆర్‌ఎస్ పార్టీకి సన్నిహితంగా ఉండే అధికారులపై కూడా సర్వేలైన్స్ కొనసాగుతున్నదని సమాచారం.

'ఫేస్ టైంలో మాట్లాడుకుందాం'

కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పుడు ఏమైనా మాట్లాడాలంటే 'ఐఫోన్ ఉందా' అని అడుగుతున్నారు. 'ఏం చెప్తామన్నా.. మాపైన కూడా నిఘా మొదలైంది. ఇదేం పద్ధతి?' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఎవరితోనైనా మాట్లాడాలంటే ఐఫోన్‌లోని ఫేస్‌టైమ్ యాప్ ద్వారా మాట్లాడాల్సి వస్తున్నది. అది కూడా 'నిఘా' వర్గాలు తెలుసుకోవచ్చుగానీ, కొంతలో కొంత సేఫ్‌గా ఉంటదని వాడుతున్నం. ఏదో మాట్లాడింద్రని అంటున్నరు.. ఏం మాట్లాడినమో తెలుస్తలేదని అంటున్నరు. ఇదేదో మంచిగనే ఉన్నదని ఫేస్‌టైమ్‌లోనే మాట్లాడుకుంటున్నం' అని వారు చెప్పున్నారు. సిగ్నల్, వాట్సాప్ యాప్‌లపైనా నిఘా పెట్టి మనం ఎవరెవరితో మాట్లాడుతున్నామో ఆరా తీస్తున్నారని వాపోతున్నారు. 'అన్నా.. మొన్న నువ్వు ఫలానా ఆయనతో ఇట్ల అన్నవంట.. అది అట్ల కాదు' అని ఒక నేతను ఉద్దేశించి ముఖ్యనేత ఒకరు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. తాను మాట్లాడిన విషయం తనకు, ఎదుటివ్యక్తికి తప్ప మరొకరికి తెలియదని, అలాంటిది ఇట్లా అనడం దేనికి సంకేతమని ఆ నేత వాపోతున్నాడు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్న ఓ నిఘా అధికారి దృష్టికి కూడా తీసుకెళ్లగా.. ఆయన ఒక నవ్వు నవ్వి.. 'అది నా డ్యూటీయే కదన్నా. మీకు తెలియనది కాదుకదా' అని అన్నట్టు తెలిసింది.

ఢిల్లీలో ప్రత్యేక వ్యవస్థ

రాష్ట్ర నిఘా అధికారులకు ఇప్పుడు ఢిల్లీలో చేతినిండా పని దొరికింది. పార్టీ అధిష్ఠానం వద్దకు ఎవరెవరు వెళ్తున్నారు.. ఎవరెవరు ఎవరిని కలుస్తున్నారనే దానిపై ఎక్కువ దృష్టి పెడుతున్నట్టు తెలిసింది. ఇటీవల ఒక కీలక మంత్రి ఢిల్లీకి వెళ్లారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులపై ఆయన అధిష్ఠానానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా అధిష్ఠానం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డిలకు సంబంధించిన నామినేటెడ్ పదవులను ఆపేసింది. ఈ విషయం నిఘా వర్గాల ద్వారా ముందే పసిగట్టిన ముఖ్యనేత హడావుడిగా ఢిల్లీకి వెళ్లి తన వాదన వినిపించే ప్రయత్నం చేశారు. అధిష్ఠానం తనకు ఇలాంటి విషయంలో సహకరించాలని, అయితేనే పార్టీని బలోపేతం చేయగలనని ఆయన చెప్పినట్టు తెలిసింది. ఢిల్లీ పెద్దల్లో కీలకమైన కేసీ వేణుగోపాల్‌ను కలిసి తన పరువుపోతున్నదని కూడా అన్నట్టు సమాచారం. అయితే, అధిష్ఠానం ఆ ముఖ్యనేతను పట్టించుకోలేదు.

నేతలకు కౌంటర్‌గా కథనాలు

ఫలానా నాయకుడు.. ఫలానా అంశంపై పార్టీ అధిష్ఠానం వద్దకు వెళ్తున్నాడంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందగానే.. తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై మీడియా, సోషల్ మీడియాలో సదరు ముఖ్యనేత కథనాలను రాయిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో పార్టీ నేతలు ఆయనపై గుర్రుగా ఉన్నారు. కొంతమంది పార్టీ నేతలకు వ్యతిరేకంగా గతంలోనూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించిన చరిత్ర ఆ ముఖ్యనేతకు ఉన్నది. తనను కాదని ఎవరైనా ఢిల్లీ పెద్దలను కలిసేందుకు ప్రయత్నిస్తే.. రెండు కండ్ల సిద్ధాంతంతో పనిచేసే ఓ మీడియా సంస్థకు చెందిన పత్రిక, టీవీ చానల్‌లో ఆ మంత్రి లేదా ఆ నేతకు వ్యతిరేకంగా కథనాలు వచ్చేస్తాయి. సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలవుతుంది. విషయం ఆ మంత్రి లేదా ఆ నేతకు అర్థమయ్యేలా చేస్తారు. ఒకరిద్దరు కీలక మంత్రులు ఈ విషయాన్ని కూడా పార్టీ అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లారని, తమపై వస్తున్న పత్రికల కథనాలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై వారు తమ నిరసన తెలిపారని గాంధీభవన్ వర్గాల సమాచారం.

రాష్ట్ర వాటా నిధులివ్వాలని కేఆర్‌ఎంబీ వినతి

హైదరాబాద్, సెప్టెంబర్5 (నమస్తే తెలంగాణ): బోర్డు నిర్వహణకు వెంటనే నిధులను విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ జైన్, మెంబర్ సెక్రటరీ డీఎం రాయపురే విజ్ఞప్తి చేశారు. జలసౌధకు విచ్చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో గురువారం ప్రత్యేకంగా కలిశారు. బోర్డుకు తెలంగాణ సర్కారు చెల్లించాల్సిన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. అందుకు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించారు.